ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -353 పేజీలు - 8 వెల - 03/- శుక్రవారం 10 ఏప్రిల్ 2026

## భూ రికార్డులు తారుమారు చేయలేరు



### కరెన్సీకి వాడే టెక్నాలజీ వాడుతున్నాం

### సూరేపల్లిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం

21 నెల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం

జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి

విభజన కన్నా జగన్ వల్లనే ఎపి నష్టపోయింది

'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

బాపట్ల జిల్లా సూరేపల్లిలో పట్టా పుస్తకాలు అందచేత



**బాపట్ల ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రజలకు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని..దానిని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఎన్నికల్లో చెప్పనివి కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని సీఎం విమర్శించారు.గురువారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో పర్యటించిన సీఎం.. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో**మిగతా 2లో...**

## మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

### భారీగా పోలింగ్ శాతం నమోదు

### అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతం





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. **మిగతా 2లో...**

## చేయాల్సింది పాదయాత్ర కాదు... ఆత్మవిమర్శన యాత్ర



: జగన్ పై షర్మిల ఫైర్ 2లో.

వైఎస్సార్ పాదయాత్రకు నేటితో 23 ఏళ్లు

జగన్‌పై షర్మిల తీవ్ర విమర్శలు

బీజేపీ కేసులకు భయపడి వైఎస్సార్ లౌకికవాదానికి జగన్ తూట్లు పొడిచారని ఆరోపణ

దళితులు, మైనారిటీలపై దాడులు జరుగుతున్నా జగన్ మౌనంగా ఉన్నారని ఫైర్

## సెల్ఫీ పిచ్చి ముగ్గురు యువతుల ప్రాణాలు తీసింది



జలపాతం వద్ద సెల్ఫీ దిగుతూ ముగ్గురు మృత్యువాత

మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స 2లో.

## డిజిటల్ పేమెంట్స్ : గంట సేపు ఆగాల్సిందే...



డిజిటల్ మోసాల కట్టడికి ఆర్బీఐ కీలక ప్రతిపాదన

రూ.10,000 దాటిన లావాదేవీలను గంటపాటు నిలిపివేయాలని సూచన

గంట సమయంలో లావాదేవీని రద్దు చేసుకునేందుకు వెసులుబాటు

వృద్ధుల కోసం అదనపు భద్రతా చర్యల ప్రతిపాదన 2లో.

## రాజకీయ ఫ్లెక్సీలపై ఏపీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం..

ఎవరిని ధ్వంసం చేస్తారని ప్రశ్న

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు, ద్వేషపూరిత రాజకీయ ఫ్లెక్సీలు

పోలీసుల నిర్లక్ష్యంపై ఏపీ హైకోర్టు సీరియస్

పోలీసుల నిర్లక్ష్యం వల్లే సమస్యలు పునరావృతం అవుతున్నాయని వ్యాఖ్య

సీఎంను అవమానిస్తే 5 కోట్ల మందిని అవమానించినట్లేనని స్పష్టీకరణ 2లో.



## వైఎస్ గురించి ఎందుకు మాట్లాడుతారు

అమరావతి గురించి మాట్లాడుకోండి

అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు అహంకారపూరితం

మండిపడ్డ మాజీమంత్రి బొత్స సత్యనారాయణ



**విశాఖపట్నం, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు దిగజారి మాట్లాడుతున్నా రని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు ఖండించడానికి తాను మీడియా ముందుకు రాలేదన్నారు. ఆయన వ్యాఖ్యలు అహంకార పూరితంగా ఉన్నాయని బొత్స అభివర్ణించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తనకు మధ్య ఎంతో అనుబంధం ఉందని ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ గుర్తు చేసుకున్నారు. **మిగతా 2లో...**



### వైఎస్సార్ మరణం వెనుక జగన్ హస్తం నిజమేనేమో

: అచ్చెన్నాయుడు

నాడు బొత్స చెప్పిందే నిజమని నమ్మాల్సి వస్తోందన్న అచ్చెన్న

## రాజీకొస్తారా..!

### నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు -ఏర్పాట్లు జరుగుతున్నాయి : పాకిస్తాన్

### కొనసాగుతున్న ఉద్రిక్తతలు.. -లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ దాడులు

### కుదరకపోతే మళ్లీ దాడులు : ట్రంప్ -యుద్ధమా? కాల్పుల విరమణా? ట్రంప్ తేల్చుకోవాలి : ఇరాన్

**వాషింగ్టన్/టెహ్రాన్: ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు ఇస్లామాబాద్ వేదికగా శుక్రవారం జరగనున్నాయి. మరోపక్క లెబనాన్‌పై దాడులు కొనసాగుతున్నాయి. దీనిపై స్పష్టత వచ్చేవరకు హోర్ముజ్ జలసంధిని తెరిచేది లేదని ఇరాన్ ప్రకటించింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిజమైన ఒప్పందం జరిగే వరకూ సైన్యం అక్కడే ఉంటుందని తెలిపారు. అయితే హిజ్బొల్లాను నిరాయుధీకరణ చేసేందుకు, ఇరు దేశాల మధ్య "శాంతి సంబంధాలను" నెలకొల్పేందుకు లెబనాన్‌తో ప్రత్యక్ష చర్చలు ప్రారంభించాలని తన మంత్రివర్గాన్ని ఆదేశించినట్టు ఇజ్రాయిల్**మిగతా 2లో...**



# భూ రికార్డులు ఇక తారుమారుచేయలేరు

మొదటిపేజీ తరువాయి

భాగంగా రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేదన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయని.. దారిలో పెడుతున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ప్రజల భూములపై కన్నేశారని.. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని మండిపడ్డారు. 'పట్టా పుస్తకంపై జగన్ ఫొటో వేసుకున్నారు.. ఆస్తి మీది.. ఫొటో ఆయనది' అని విమర్శించారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతిపోయిందని సీఎం అన్నారు. నూటికి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతినెలా 9న ఒక ప్రాంతంలో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని.. జులై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి కోటి 12లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని
వెల్లడించారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రికార్డులు మారుస్తున్నామని చెప్పారు. రైతులకు ఇస్తున్న పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరన్నారు. కరెన్సీకి వాడే టెక్నాలజీని పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. 22ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకొస్తామన్నారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు



ఆదర్శం కాకూడదని సీఎం అన్నారు. సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూమి నుంచి వచ్చే ఆదాయమే కాకుండా.. సముద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేసిందని.. ప్రతి దానిపైనా అప్పులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోయిందన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను డెవలప్ చేశానని.. ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్నీ ఆలోచించే రాజధానికి అమరావతి పేరు




పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రజా రాజధాని.. దేవతల రాజధాని.. అమరావతి' అని పేర్కొన్నారు. ఆనాడు బాబాయ్‌ని చంపి.. ఆ నేరం తనపై వేశారని సీఎం మండిపడ్డారు. అమరావతిపై జగన్ కక్షగట్టారని.. ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియోలు తీశారని, లాఠీలతో కొట్టించారని గుర్తుచేశారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచిందన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ఒక్కడే సైకో అనుకున్నామని.. వైసీపీ నేతలంతా సైకోలుగా మారారని వ్యాఖ్యానించారు. 'నీలాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదు' అని స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే విధ్వంసం చేశారని... ప్రతిపక్షంలో ఉంటే బెదిరిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేయాలనుకుంటే.. దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

మొదటిపేజీ తరువాయి

మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# చేయాల్సింది పాదయాత్ర కాదు... ఆత్మవిమర్శన యాత్ర

## : జగన్ పై షర్మిల ఫైర్

**అమరావతి ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చారిత్రాత్మక పాదయాత్ర చేపట్టి నేటికి 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, జగన్ విధానాలను, వైఎస్సార్ ఆశయాలను పోలుస్తూ షర్మిల సూటి ప్రశ్నలతో విరుచుకుపడ్డారు. తండ్రి పేరును పార్టీలో పెట్టుకుని, ఆయన ఆశయాలకు పూర్తిగా వ్యతిరేకంగా జగన్ పనిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.
"ఇవాళ ఏప్రిల్ 9! సరిగ్గా 23 సంవత్సరాల క్రితం మన తండ్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారు, అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో పాదయాత్ర అనే మహాయజ్ఞం మొదలుపెట్టారు. పేదల బాగు కోసం, బడుగుల మంచి కోసం, సకల జనుల సంక్షేమ మహాయాగానికి నాడు ఆయన శ్రీకారం చుట్టారు. ఆయన ఈ పాదయాత్ర ఒక కాంగ్రెస్ సైనికునిగా, నాయకునిగా, పీసీసీ అధ్యక్షునిగా ప్రారంభించారు. ఆ తర్వాత అయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి ముఖ్యమంత్రిగా చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు.
మరి అటువంటి తండ్రికి కుమారునిగా, పార్టీ పేరులో ఆయన పేరును పొందుపర్చి మీరు నేడు చేస్తున్నది ఏమిటి? ఆజన్మాంతం పేదలు, దళితులు, మైనారిటీలు, మహిళలు, రైతులు, ఎస్టీలు, వీరి కోసం తపించి, తన పాలనలో వీరికోసం ఎన్నో పథకాలను రచించిన ఆయన ఎక్కడ, నేడు ఫాసిస్టు శక్తులకు తలవంచి వాళ్ళ క్యాపిటలిస్టు పోకడలకు దాసోహం అయిన మీరెక్కడ?
లౌకికవాదాన్ని తన ఊపిరిలో నింపుకుని, అన్ని వర్గాలవారిని సమానంగా ఆదరించి, ప్రజల ఐక్యత కోసం పాటుపడింది వైఎస్సార్, మరి అయన తనయునిగా మీరు నేడు చేస్తున్నది ఏమిటి? మతోన్మాద బీజేపీ దగ్గర కేసులకు, రాజకీయ భవిత కోసం భయపడి మోకరిల్లడం. ఇది ఎంత వరకు ధర్మం? బీజేపీ ప్రతి చర్యలో దళిత, మైనారిటీ వ్యతిరేక పోకడలు ఉన్నాయ్. వక్ఫ్ చట్టం అయితేనేమి, దళిత క్రిస్టియన్ రిజర్వేషన్లు ఐతేనేమి, ఎఫ్ సీఆర్ఏ చట్టం అయితేనేమి, బుల్ డోజర్ రాజకేయాలితేనేమి. వీటన్నిటికి గల్లీలో మౌనం వహించి, ఢిల్లీలో బేషరతు మద్దత్తు ప్రకటించిన మీరా ఆయనకు నివాళి అర్పించేది ఇవాళ? ఆయనబతికుంటే ఇవి హర్షించేవారా? ఇది ఆయన ఆదర్శాలకు, అభిమతాలు పూర్తి వ్యతిరేకం కదా?
ఇక మీ ఐదేళ్ల పాలనలో సభ్యసమాజం సిగ్గుపడేలా దళితుల మీద, మహిళల మీద జరిగిన దాడులు, చివరికి మైనార్టీల మీద కూడా జరిగిన అక్రమాలు, ఇవన్నీ రాజశేఖర రెడ్డిగారి ఆత్మ క్షోభించే పనులు కాదంటారా? అణువణువునా రాజశేఖర రెడ్డిగారి పాలనకు, ఆలోచనలకూ భిన్న ధ్రువంగా ఉంటూ మీరు ఇవాళ అయన పాదయాత్రను తల్చుకుని నివాళులు అర్పించడం హాస్యాస్పదంగా ఉంది. మొన్న ప్రకటించినట్టు మీరు చేయాల్సింది పాదయాత్ర కాదు, ఆత్మవిమర్శన యాత్ర" అంటూ షర్మిల పేర్కొన్నారు.

# వైఎస్సార్ మరణం వెనుక జగన్ హస్తం నిజమే నేమో : అచ్చెన్నాయుడు

**అమరావతి ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నేటి పరిస్థితులు చూస్తుంటే... వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం వెనుక జగన్ హస్తం ఉందంటూ గతంలో వ్యక్తమైన అనుమానాలు నిజమేనని నమ్మాల్సి వస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. పదవీ వ్యామోహంతో జగన్ ఒక సైకోలా ప్రవర్తిస్తున్నారని, ఆయన నైజం చూస్తుంటే నాడు బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు వాస్తవమే అనిపిస్తోందని అన్నారు. ఒక వ్యక్తి ప్రవర్తన వల్ల కుటుంబం, సమాజం ఎలా నాశనమవుతాయో చెప్పడానికి జగన్ ఒక ఉత్తమ ఉదాహరణ అని అచ్చెన్నాయుడు మండిపడ్డారు.
ఇవాళ మీడియా సమావేశంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, "2009లో వైఎస్సార్ హెలికాప్టర్ ప్రమాదానికి గురైనప్పుడు రాష్ట్రమంతా ఆందోళనలో ఉంది. కానీ, ఆ సమయంలో జగన్ ఇతర రాష్ట్రాల్లో ఉండాల్సిన అవసరం ఏమొచ్చింది? వైఎస్ మరణవార్త నిర్ధారణ కాకముందే ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాల సేకరణ చేపట్టాల్సిన తొందర ఎందుకు వచ్చింది? వైఎస్ మరణం వెనుక జగన్ హస్తం ఉందని నాడు ప్రస్తుత వైసీపీ నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను మేం నమ్మలేదు. కానీ, ఇప్పుడు జగన్ నైజం, ఆయన ప్రవర్తన చూస్తుంటే అవే నిజమేమో అనిపిస్తోంది" అని అన్నారు. తండ్రి బతికి ఉంటే తాను సీఎం కాలేనని



భావించిన జగన్, ఆయనను మానసిక క్షోభకు గురిచేశారని, అందుకే వైఎస్సార్ ఆయన్ను రాష్ట్రానికి దూరంగా బెంగళూరు పంపించారని స్వయంగా రోశయ్యే చెప్పిన విషయాన్ని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు.
"పదవీ వ్యామోహం ఉంటే సైకోలు తండ్రి, తల్లి, చెల్లి, బాబాయి అని కూడా చూడరని జగన్‌ను చూస్తే అర్థమవుతోంది. తండ్రి మరణంతో వచ్చిన సింపతీతో పార్టీ పెట్టి, 2014లో సీఎం అయ్యేందుకు ప్రయత్నించారు. 2019లో అధికారం కోసం సొంత బాబాయిని అత్యంత దారుణంగా హత్య చేయించి, ఆ సానుభూతితోనే గెలిచారు. వివేకాను ఎవరు చంపారో రాష్ట్రంలో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారు. ఇప్పుడు సొంత తల్లి, చెల్లే ఆయన అసలు నైజాన్ని బయటపెడుతున్నారు. తండ్రి ఇచ్చిన మాట నిలబెట్టమని అడిగిన కన్నతల్లినే ఇంట్లోంచి బయటకు పంపిన చరిత్ర జగన్‌ది" అని అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు.
జగన్ నిలకడలేని వ్యక్తిత్వానికి నిలువుటద్దమని, ఆయనో రాజకీయ సైకో అని అచ్చెన్న అభివర్ణించారు. "సీఎం పదవి కోసం కాంగ్రెస్‌పై దాడి చేశారు, బెయిల్ కోసం సోనియా కాళ్ల మీద పడ్డారు. అమరావతికి అంగీకరించి, అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులంటూ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారు. ఇప్పుడు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడంతో 'మావిగన్' అంటూ కొత్త నాటకానికి తెరలేపారు. జిల్లాల మధ్య తగువులు పెట్టే ఈ ప్రతిపాదనను చూసి వైసీపీ నేతలే నవ్వుకుంటున్నారు" అని ఎద్దేవా చేశారు.
ఉత్తరాంధ్రకు గత టీడీపీ ప్రభుత్వం ఏం చేసిందో కాలికి గజ్జె కట్టుకుని వివరిస్తానని సవాల్ విసిరారు. "అధికారంలో ఉన్న ఐదేళ్లు ఉత్తరాంధ్రకు ఏం చేశారని ఇప్పుడు మావిగన్ అంటున్నారు? పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. తన తల్లిలాంటి భువనేశ్వరి గారిని, అమరావతి మహిళలను, చివరికి కన్నచెల్లి షర్మిళ క్యారెక్టర్‌ను కూడా కించపరిచేలా మాట్లాడించిన జగన్‌కు ఆడవాళ్ల గురించి మాట్లాడే హక్కు లేదు. రాష్ట్ర ప్రజలకు జగన్ పిచ్చి చేష్టలు పూర్తిగా అర్థమయ్యాయి. ఆయన ఇక ఎప్పటికీ అధికారంలోకి రాలేరు. సమాజానికి పట్టిన చీడ పురుగు లాంటి జగన్, తన పదవి కోసం ఎంతమందిని పొట్టన పెట్టుకున్నారో ప్రజలు గుర్తుంచుకోవాలి" అని అచ్చెన్నాయుడు అన్నారు.

## సెల్ఫీ పిచ్చి ముగ్గురు యువతుల

# ప్రాణాలు తీసింది

### జలపాతం వద్ద సెల్ఫీ దిగుతూ ముగ్గురు మృత్యువాత

**అల్లూరి, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** సరదాగా ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవాలని యువత పడుతున్న ఆరాటం వారి ప్రాణాల మీదకు తెస్తోంది. సెల్ఫీ మాయలో పడి తమ వైపు పొంచి ఉన్న ముప్పును తెలుసుకోలేక అనేక మంది యువత ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఎన్నో. అల్లూరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అనంతగిరి మండలం మూలగుమ్మిలో సెల్ఫీ దిగుతూ నలుగురు బాలికలు జలపాతంలో పడిపోయారు. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో బాలిక అంజలి పరిస్థితి విషమంగా ఉంది. బాలికను అనంతగిరి మండలం లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. మృతులు త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16)ను హుకుంపేట మండలం జుంబువలస వాసులుగా స్థానికులు గుర్తించారు. ఇటీవలే వీరంతా ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. సెల్ఫీ పిచ్చి వీరిని ప్రమాదంలోకి నెట్టేసింది. తాజాగా అల్లూరి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. సెల్ఫీ సరదా ముగ్గురు యువతుల ప్రాణాలను బలిగొంది. అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ మల్లంగుమి గ్రామ సమీపంలో ఉన్న జలపాతం వద్ద నలుగురు యువతులు సరదాగా సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఇంతలోనే ప్రమాదవశాత్తు జలపాతంలో పడిపోయారు. వారిలో ముగ్గురు అమ్మాయిలు మృతి చెందగా... మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురమ్మాయిలు జలపాతం సమీపంలో నిలిచి ఉండగా.. మరొక అమ్మాయి సెల్ఫీ తీస్తుండగా ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు నలుగురు అమ్మాయిలను రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే ముగ్గురు యువతులు మరణించారు. ఓ యువతిని రక్షించి ఆస్పత్రికి తరలించగా.. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులు బూర్జ పంచాయతీ జంబు వలస గ్రామానికి చెందిన త్రిష, పవిత్ర, రత్నకుమారిగా గుర్తించారు. అంజలి అనే మరో యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. యువతుల మృతితో జంబు వలస గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాజకీయ ఫ్లెక్సీలపై ఏపీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం..

### ఎవరిని ధ్వంసం చేస్తారని ప్రశ్న

**అమరావతి ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఫ్లెక్సీలు, సోషల్ మీడియాలో ఆక్షేపణీయ పోస్టుల సంస్కృతిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఎవరిని ధ్వంసం చేస్తారు? 2029లో ధ్వంసం చేయాలని ఎదురు చూస్తున్నారా? రాష్ట్రాన్నా లేక ప్రజలనా?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటివి పునరావృతం అవుతున్నాయని మండిపడింది.
వైసీపీ మాజీ సోషల్ మీడియా వింగ్ కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్ రెడ్డిపై జారీ అయిన లుక్ అవుట్ సర్క్యులర్‌ను (ఎల్ఓసీ) రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆక్షేపణీయ పోస్టులు పెట్టేవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని కోర్టు అభిప్రాయపడింది. ఒకసారి అరెస్ట్ చేసినా మళ్లీ అలాంటి పోస్టులే పెడుతున్నారని, గతంలో న్యాయమూర్తులను లక్ష్యంగా చేసుకున్న వారిపై కఠినంగా వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని గుర్తుచేసింది. 2024 ఎన్నికల తర్వాత కూడా ఇంకా ఇలాంటివి కొనసాగిస్తున్నారా అని ఆశ్చర్యం వ్యక్తం చేసింది."ముఖ్యమంత్రిని అవమానించడం అంటే 5 కోట్ల మంది ఆంధ్రులను అవమానించడమే. ఎవరి కుటుంబాన్ని అయినా అవమానించే హక్కు ఎవరికీ లేదు" అని హైకోర్టు స్పష్టం చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, సజ్జల భార్గవ్ రెడ్డి పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది.

## డిజిటల్ పేమెంట్స్: గంట సేపు ఆగాల్సిందే...

### మోసాల కట్టడికి ఆర్బీఐ ప్రతిపాదన

**ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
దేశంలో పెరుగుతున్న డిజిటల్ చెల్లింపుల మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక ప్రతిపాదనలు చేసింది. రూ.10,000కు పైబడిన ఆన్‌లైన్ లావాదేవీలను ఒక గంట పాటు హోల్డ్ లో ఉంచే (నిలిపివేత) విధానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ మేరకు గురువారం ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసి, ప్రజల నుంచి అభిప్రాయాలను కోరింది.
ఈ ప్రతిపాదన ప్రకారం, ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు రూ.10,000 కంటే ఎక్కువ మొత్తంలో డబ్బు పంపితే, ఆ లావాదేవీ వెంటనే పూర్తికాదు. బదులుగా, పంపిన వారి వద్ద గంట పాటు నిలిచిపోతుంది. ఈ సమయంలో, డబ్బు పంపిన వ్యక్తికి తన లావాదేవీని రద్దు చేసుకునే అవకాశం ఉంటుంది. లావాదేవీ అనుమానాస్పదంగా అనిపిస్తే, బ్యాంకు మరోసారి నిర్ధారణ కోరుతుంది. వ్యాపార చెల్లింపులు, ఈ-మాండేట్లు, నాచ్ లావాదేవీలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు.
2025 నాటికి దేశంలో డిజిటల్ మోసాల విలువ రూ.22,930 కోట్లకు చేరడంతో ఆర్బీఐ ఈ చర్యలకు ఉపక్రమించింది. మొత్తం మోసాల విలువలో సుమారు 98.5 శాతం.. రూ.10,000కు పైబడిన లావాదేవీల ద్వారానే జరుగుతున్నాయని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది. సోషల్ ఇంజినీరింగ్ ద్వారా బాధితులపై ఒత్తిడి తెచ్చి మోసగాళ్లు డబ్బు బదిలీ చేయిస్తున్నారని, ఈ గంట సమయం ఆలస్యం వల్ల బాధితులకు ఆలోచించుకునే అవకాశం దొరుకుతుందని ఆర్బీఐ పేర్కొంది.
ఇదే చర్చా పత్రంలో ఆర్బీఐ మరికొన్ని ప్రతిపాదనలను కూడా చేర్చింది. 70 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు రూ.50,000కు మించి చేసే లావాదేవీలకు వారు నామినేట్ చేసిన 'విశ్వసనీయ వ్యక్తి' ఆమోదం తప్పనిసరి చేయాలని సూచించింది. ఖాతాల్లోకి వచ్చే పెద్ద మొత్తాల జమలపై సమీక్ష, అలాగే అన్ని డిజిటల్ చెల్లింపులను ఒకేసారి నిలిపివేసే 'కిల్ స్విచ్' వంటివి ఇతర ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఈ ప్రతిపాదనలపై మే 8వ తేదీలోగా అభిప్రాయాలు తెలియజేయాలని వాటాదారులను ఆర్బీఐ కోరింది. వచ్చిన స్పందనల ఆధారంగా మార్గదర్శకాలను జారీ చేయనుంది.

## వైఎస్ గురించి ఎందుకు మాట్లాడుతారు

మొదటిపేజీ తరువాయి

గురువారం రాజధాని అమరావతిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో స్పందించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర రెడ్డిని గుర్తు చేసుకుని బొత్స తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. టీడీపీపై గతంలో మీరు ఏమన్నారో మర్చిపోయారా అంటూ అచ్చెన్నాయుడును ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయిన తర్వాత.. తాను, తన భార్య పావురాల గుట్టకు వెళ్లామని పేర్కొన్నారు. కావాలంటే రాజధాని అమరావతిపై మాట్లాడండి.. అంతేకానీ ఏమిటి ఈ మాటలు? అంటూ అచ్చెన్నాయుడిని బొత్స నిలదీశారు. చనిపోయిన వ్యక్తి గురించి ఎందుకు మాట్లాడతారు? అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాలు కోసం ఇంత దిగజారుడా.. ఇదేమి రాజకీయం అంటూ సీఎం చంద్రబాబును బొత్స ప్రశ్నించారు. తానెప్పుడూ పదవుల కోసం పాకులాడలేదని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు బాధాకరమన్నారు. వైఎస్ మరణంపై అచ్చెన్నాయుడు దిగజారి విమర్శలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా బొత్స భావోద్వేగానికి గురయ్యారు. వైఎస్‌తో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. తన మంత్రి పదవితో అచ్చెన్న ప్రజలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. రాజకీయాల్లో గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. జగన్‌పై రాజకీయ విమర్శలు ఎన్నైనా చేయండని.. వైఎస్ఆర్ మరణం ప్రస్తావన తీసుకురావడం అప్రస్తుతమని తెలిపారు. కావాలంటే పాత వీడియో క్లిప్పింగులు చూసుకోవచ్చన్నారు. మావిగన్ నచ్చకపోతే అమరావతే కావాలని చెప్పండని తెలిపారు.

# రాజీకొస్తారా..!

మొదటిపేజీ తరువాయి

ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తెలిపారు.
"ఇజ్రాయిల్‌తో ప్రత్యక్ష చర్చలు జరపాలని లెబనాన్ పదేపదే అభ్యర్థనలు చేస్తుంది. దీంతో వీలైనంత త్వరగా లెబనాన్‌తో ప్రత్యక్ష చర్చలు ప్రారంభించాలని నేను నిన్న క్యాబినెట్‌ను ఆదేశించాను" అని ఆయన కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ 'అమెరికా కాల్పుల విరమణ లేదా ఇజ్రాయిల్ ద్వారా యుద్ధాన్ని కొనసాగించడమా అనేది తేల్చుకోవాలి' అని అన్నారు. రెండూ సాధ్యం కాదు, లెబనాన్‌పై ఇజ్రాయిల్ మారణకాండను ప్రపంచం చూస్తుందని అరాగ్చీ సోషల్ మీడియా ఎక్స్‌లో గురువారం తెలిపారు. అలాగే ఈ దాడులు కొనసాగితే ఒప్పందం బలహీనపడి, ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదముందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. అయితే ఇజ్రాయిల్ బరితెగింపు తీవ్ర ప్రభావం చూపుతుందని అంతర్జాతీయంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# కొత్తబురుజులో ఇంటింటికీ శుద్ధజలానికి శ్రీకారం

**రూ.30 లక్షలతో నల్లా కనెక్షన్ల పనుల ప్రారంభం**

**సీఎం హామీ అమలు దిశగా వేగంగా అడుగులు**

**స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు**

**హార్టికల్చర్‌తో రైతులకు అధిక ఆదాయం అవకాశాలు**

**100 రోజుల ప్రణాళికతో నీటి భద్రతకు చర్యలు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో ఏప్రిల్ 09 (రిపబ్లిక్ న్యూస్):** డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో ఇంటింటికీ శుద్ధజలాన్ని అందించే లక్ష్యంతో కొళాయి కనెక్షన్ల పనులను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం కొత్తబురుజు గ్రామంలో జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డితో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత నెల 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామ పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు ఈ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి, జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదం కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్లు లేని 30 మంది లబ్ధిదారులకు రూ.4.5 లక్షలతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించామని తెలిపారు. ఈ చర్యలతో గ్రామంలో పరిశుభ్రత పెరగడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు బలం చేకూరుతుందని అన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన గతంలో కోరిన ఆరు పనులను ఇప్పటికే మంజూరు చేశామని, అవి సకాలంలో పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. మిగిలిన పనులను కూడా వారం నుంచి పది రోజుల్లో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, చెరువులు, ఫీడర్ ఛానల్స్ అభివృద్ధి వంటి పనులు పూర్తయితే భూగర్భ జలమట్టం పెరిగి అందరికీ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలంతా ఐక్యంగా సహకరించాలని పిలుపునిచ్చారు.

### హార్టికల్చర్ రైతులకు బంగారు భవిష్యత్

జిల్లాలో సుమారు 7 లక్షల ఎకరాల్లో సాగవుతున్న సాధారణ పంటల ద్వారా రూ.4,000 కోట్ల ఆదాయం వస్తుండగా, కేవలం 49 వేల హెక్టార్లలో సాగవుతున్న ఉద్యానవన పంటల ద్వారా రూ.7,000 కోట్ల ఆదాయం లభిస్తోందని తెలిపారు. ఇందులో డోన్ నియోజకవర్గం కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. రైతులు హార్టికల్చర్ పంటలపై దృష్టి సారిస్తే మరింత లాభదాయకంగా ఉంటుందని సూచించారు.

### 100 రోజుల ప్రణాళికతో నీటి భద్రత

నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపడం, ఫీడర్ ఛానల్స్ శుభ్రపరచడం వంటి పనులకు ప్రాధాన్యతనిస్తూ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. బోరు బావులపై



ఆధారపడే రైతులకు నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ప్రజల సహకారమే అభివృద్ధికి మూలం

గ్రామాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన గ్రామాన్ని నిర్మించగలమని కలెక్టర్ పిలుపునిచ్చారు. డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించడం కోసం కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేర్చుతామని, నీటి కొరత సమస్యను పూర్తిగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పెన్షన్లు, ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. అలాగే, డ్రిప్ ఇరిగేషన్ మరియు స్ప్రింక్లర్ పద్ధతులను తిరిగి ప్రవేశపెట్టి నీటి వినియోగాన్ని తగ్గిస్తూ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

## మండల అభివృద్ధి కార్యాలయంలో జనగణన శిక్షణ సదస్సు.






**ఓబులవారిపల్లి ఏప్రిల్ 9 రిపబ్లిక్ న్యూస్.** మండల కేంద్రం ఓబులవారిపల్లి లోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం 2027 జన గణన పై శిక్షణ సదస్సు నిర్వహించడం జరిగినది, మండల తాసిల్దార్ యామిని రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగినది, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఏప్రిల్ 9 నుండి మూడు రోజులు, ఏప్రిల్ 15 నుండి మూడు రోజులు అలాగే ఏప్రిల్ 21 నుండి మూడు రోజులు పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని యామిని రెడ్డి తెలియజేశారు. శిక్షణ తరగతుల అనంతరం వారి విధులను పూర్తి చేయాల్సి ఉంటుందని యామిని రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావు, ఎం ఆర్ఐ మల్లికార్జున్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.ద

## ఎస్.కె. యూనివర్సిటీ వీసీ, రెక్టర్‌కు అభినందనలు





**అనంతపురం ఎస్ కే యూ, ఏప్రిల్ 09,(రిపబ్లిక్ న్యూస్ ):** ఎస్.కె. యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎన్‌వీఆర్ జ్యోతి కుమార్ గారికి, అలాగే యూనివర్సిటీ రెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ అనిత గారికి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ , లెక్చరర్స్ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. చెన్న కేశవులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారి నాయకత్వంలో ఎస్.కె. యూనివర్సిటీ విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడి, విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా నాయకులు జె. ద్వారకానాథ్, శ్యామ్, ఎస్. ప్రకాష్ బాబు పాల్గొని అభినందనలు తెలిపారు.

## అవుకు ఏపీ మోడల్ స్కూల్‌లో ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష



**అవుకు ఏప్రిల్ 09( రిపబ్లిక్ న్యూస్)** అవుకు ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశాల కోసం ఏప్రిల్ 12వ తేదీ (ఆదివారం) ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుంది అని పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి ఎస్. హేమీమా తెలిపారు.ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సంబంధిత హాల్ టిక్కెట్లను అధికారిక వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష రోజున ఉదయం 9:30 గంటలకే పాఠశాలకు చేరుకోవాలని సూచించారు.అదేవిధంగా, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట్ చదివే బాలికలకు ఉచిత హాస్టల్ సదుపాయం కల్పించబడుతుందని వెల్లడించారు.

## రాయలసీమ హక్కులపై 12 ఏళ్లుగా సాగుతున్న మోసం

**--- మూడు ప్రభుత్వాలపై బొజ్జా దశరథరామిరెడ్డి ఘాటు విమర్శలు**




**నంద్యాల ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమకు హామీ ఇచ్చిన హక్కులను గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మూడు ప్రభుత్వాలు అమలు చేయకపోవడం కేవలం నిర్లక్ష్యం కాదు.. ఇది స్పష్టమైన ద్రోహం అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.

గురువారం నంద్యాల పట్టణంలోని సమితి కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా బొజ్జా మాట్లాడుతూ..

విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక ప్యాకేజీతో పాటు తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా, వెలుగొండ వంటి సాగునీటి ప్రాజెక్టులు, కడప ఉక్కు కర్మాగారం, గుంతకల్లు రైల్వే జోన్, అనంతపురంలో ఎయిమ్స్ వంటి హామీలు అన్నీ కేవలం ఎన్నికల నినాదాలుగానే మిగిలిపోయాయని, ఒక్క అడుగు కూడా ముందుకు వేయని పాలకుల వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు.

అలగనూరు రిజర్వాయర్ నుంచి గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మత్తులు, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం వరకు అన్ని ప్రాజెక్టులు ప్రకటనలకే పరిమితమైపోయాయని, పుష్కర కాలంగా రాయలసీమ ప్రజలను మభ్యపెట్టడమే ప్రభుత్వాల పని అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాయలసీమను పూర్తిగా వనరుల దోపిడి కేంద్రంగా మార్చి, నీరు, అటవీ సంపద, ఖనిజాలను ఇతర ప్రాంతాలకు తరలించేసి ఈ ప్రాంతాన్ని నిర్వీర్యం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకుని, వ్యవసాయం మీద ఆధారపడిన రైతులు, కూలీలు, కౌలు రైతులను ఉపాధి లేకుండా చేస్తూ, ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడం అత్యంత దారుణమని మండిపడ్డారు.

కోస్తా ప్రాంతంలో పండిన వరి పంటను కనీస మద్దతు ధరకు భారీ స్థాయిలో కొనుగోలు చేపడుతున్న ప్రభుత్వాలు, అదే సమయంలో ప్రభుత్వ సూచనల మేరకు వరికి ప్రత్యామ్నాయంగా రాయలసీమలో పండిస్తున్న చిరుధాన్యాలు, పప్పు దినుసులను కనీస మద్దతు ధరకు సేకరించడంలో స్పష్టమైన వివక్ష చూపుతున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు.

"రాయలసీమకు హక్కులు కాగితాలపైనేడ అమలులో మాత్రం సున్నా" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పదేళ్లు హైదరాబాద్‌ను రాజధానిగా కొనసాగించాల్సి ఉన్నప్పటికీ, ఆగమేఘాల మీద రాజధాని మార్పిడి చేసి రాష్ట్రాన్ని అప్పుల కూపంలోకి నెట్టారని, దీనికి అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ సమానంగా బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు."రాయలసీమకు న్యాయం చేయకుండా రాజధాని అభివృద్ధి పేరుతో నాటకాలు ఆపాలి" అని ఆయన హెచ్చరించారు.సమితి కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ..

అమరావతి రాజధాని పేరుతో కొత్త హామీలు ఇస్తున్న ప్రభుత్వాలు ముందుగా రాజధాని ఆదాయంలో రాయలసీమ వాటా ఎంతరాజధానిలో రాయలసీమ వాసులకు ఎన్ని ఉద్యోగాలు?

రాజదానిలో రాయలసీమ నిరుద్యోగులకు ఉపాధి, వ్యాపారాల కోసం ఎంత భూమి కేటాయింపు?

అనే అంశాలను స్పష్టంగా ప్రకటించి, పార్లమెంట్ ద్వారా చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు.

రాజకీయ పార్టీలు ఈ ద్రోహంపై మౌనం పాటించడం, రాయలసీమ సమాజం నిశ్శబ్దంగా ఉండడమే దీనికి కారణమని పేర్కొంటూ, ఇకపై ప్రజలను చైతన్యపరిచే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాబోయే రోజుల్లో భారీ స్థాయిలో ఆందోళనలు, కార్యక్రమాలు చేపట్టి రాయలసీమ హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, బెక్కెం రామసుబ్బారెడ్డి, బాలీశ్వరరెడ్డి, సంజీవ, రామనాగిరెడ్డి, రెడ్డి జాఫర్, చంద్రశేఖర్, యుగంధర్, ఎంసీ కొండారెడ్డి, మనోజ్, దశరథరామ్, శివరాంరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎర్రం శంకర రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు జీజీహెచ్‌లో అభివృద్ధి పనులపై సూపరింటెండెంట్ క్షేత్రస్థాయి పరిశీలన

**డయాగ్నోస్టిక్ బ్లాక్ నిర్మాణానికి వేగం పెంచాలని ఆదేశం -శానిటేషన్, డ్రైనేజీ, ఎం సి హెచ్ వార్డుపై ప్రత్యేక దృష్టి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 9)** కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రి సేవలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా వివిధ విభాగాలను ఆయన సందర్శించి అధికారులకు కీలక సూచనలు చేశారు.

ముందుగా ఆసుపత్రి ప్రాంగణంలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను సందర్శించిన ఆయన, 3వ మరియు 4వ అంతస్తుల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను సమగ్రంగా పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకుని, రోగులకు త్వరితగతిన సేవలు అందించేందుకు పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

తదుపరి గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తులోని బ్లడ్ శాంపిల్స్ విభాగాలను తనిఖీ చేసిన సూపరింటెండెంట్, శానిటేషన్‌ను మరింత మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆసుపత్రి డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ పనులను పరిశీలిస్తూ ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అలాగే ఎం సి హెచ్ (మాతృ మరియు శిశు సంరక్షణ) వార్డును సందర్శించిన డాక్టర్ వెంకటేశ్వర్లు, అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వార్డుల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గర్భిణీలు మరియు బాలింతలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివ బాల, డాక్టర్ సునీల్ ప్రశాంత్, డాక్టర్ క్లింటన్ తదితరులు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# అంబులెన్స్ సొంత పనులకు వాడుకుంటున్న డ్రైవర్ మరియు టెక్నీషియన్

**హత్నూర:09 ఏప్రిల్ 26( రిపబ్లిక్ న్యూస్)**




హత్నూర మండలంలోని పి హెచ్ సి హాస్పిటల్ లో ఉన్న అంబులెన్స్ ఎప్పుడు కూడా అందుబాటులో ఉండదని ప్రజలు విన్నవించారు ఏమనగా ఎప్పుడూ చూసినా డ్రైవర్ మరియు టెక్నీషియన్ వీరిద్దరి మాత్రమే అంబులెన్స్లో తన సొంత పనులకు తిరుగుతూ ఉంటారు చాయ్ కి తాగడానికి పోయిన అంబులెన్స్ తీసుకెళ్తారు టిఫిన్ మరియు లంచ్ కల్లుకు కూడా ప్రభుత్వ అంబులెన్స్ ని వాడుకుంటున్నారు ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే తాగి ఉండడం వల్ల అందుబాటులో ఉన్న అందుబాటులో మేము అని చెప్తున్నారు గట్టిగా మాట్లాడితే ప్రజలనే తిడుతున్నారు వీరిద్దరిపై వైద్య అధికారులు చర్యలు తీసుకొని ఇప్పటికైనా పేదవాళ్ల కు ఆపదలు వస్తే అంబులెన్స్ అందుబాటులో ఉందని ఒక ధైర్యాన్ని వైద్యాధికారులు ఇవ్వాలని కోరుతున్నాం

# మధ్యాహ్న భోజనంపై ప్రత్యక్ష తనిఖీ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన పాణ్యంఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**ఓర్వకల్లు ప్రతినిధి, ఏప్రిల్ 09,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ఓర్వకల్ మండలంలోని గురువారం రోజు సోమయాజులపల్లె గ్రామంలో ఉన్న మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల (హైస్కూల్)ను ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై భోజనం చేసిన పాణ్యం ఎమ్మెల్యే వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, వంట విధానంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన, పోషకాహారం అందించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు.పాఠశాలలో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ, కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధికారులు మరియు మండల టిడిపి నాయకులు సోమయాజులు పల్లె గ్రామ నాయకులు

# గాంధీ మృతికి కారణం వివాహేతర సంబంధం -సి.ఐ సాయి ప్రసాద్



**ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**

ఇటీవల బోయకొండ అడవిలో గాంధీ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ తెలిపారు.ఆయన కథనం మేరకు... రెండు సంవత్సరాల క్రితం తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాతం చెందిన గాంధీ తన భార్య అయిన రాసాతి తో కలసి చౌడేపల్లి మండలం ఊటూరు దగ్గర కోళ్ల ఫారం లో పనికి వచ్చి ఉండేవారు. ఈ క్రమంలో బోయకొండ ఆర్ఆర్ కాలనీకి చెందిన నరసింహులు ఆమెకు పరిచయం అయ్యి తన భర్తను వదిలి నరసింహులు తోపాటు రాసాతి వెళ్లిపోయింది. అతనితో సహజనం చేస్తూ ఉంటే పది రోజుల క్రితం గాంధీ బోయకొండకు వచ్చి తన భార్యను తనతో రమ్మని వేధించగా నరసింహులు అతని తమ్ముళ్లు లక్ష్మీపతి నాగరాజు రాసాతి తో పథకం ప్రకారం ఈనెల ఐదవ తేదీన రాత్రి 8 గంటలకు గాంధీని అడవిలోకి తీసుకెళ్లి మద్యం తాపించి రాళ్లతో కట్టెలతో కొట్టి చంపి అక్కడే విడిచి పారిపోయారని ఆయన వివరించారు. ఈ సంఘటనపై గాంధీ తమ్ముడు అయిన సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌడేపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించామన్నారు. ఈ క్రమంలో వారి నలుగురును గురువారం ఉదయం 10 గంటలకు బోయకొండ ఆర్చి నిమ్మనపల్లి రోడ్డు నందు అరెస్టు చేసి వారు నేరానికి ఉపయోగించిన కట్టె రాళ్లను స్వాధీనపరచుకొని ముద్దాయిలను రిమాండ్ కు తరలించినట్లు సిఐ వివరించారు. హత్య జరిగిన నాలుగు రోజుల్లోనే కేసును చేదించడం విశేషం.

# పేద ప్రజల గుండెల్లో ఆశాజ్యోతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జన్మదిన వేడుకలు





**గుత్తి ఏప్రిల్ 09: (రిపబ్లిక్ న్యూస్)**గుత్తి మండలం మాముదూరు గ్రామంలో గురువారం పేదల గుండెల్లో చిరుస్థాయిగా నిలిచిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జిల్లా ప్రజల గుండెల్లో చిరుస్థాయిగా నిలిచిన తన జీవితాన్ని పేద ప్రజలకు అంకితం చేసిన మహనీయుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ మరువలేని సేవలు అందించారని కొనియాడారు , ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మాజీ మంత్రి పల్లె నివాసానికి లంకా దినకర్ రాక

## పుష్పగుచ్చం అందించి అపూర్వ స్వాగతం పలికిన పల్లె కుటుంబ సభ్యులు

**అనంతపురం ఏప్రిల్ 09,( రిపబ్లిక్ న్యూస్ ):**

అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏపీ 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ గురువారం ఆలమూరు రోడ్ లో ఉన్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నివాసానికి విచ్చేశారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన లంకా దినకర్ కు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి , పివి కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డిలు పుష్పగుచ్చం అందించి అపూర్వ స్వాగతం పలికారు. శాలువా కప్పి సన్మానించి సత్కరించారు.



**వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయం**


ఈ సందర్భంగా లంక దినకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమం , అభివృద్ధి పథకాలను సమీక్షించేందుకు జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం అనంతపురం జిల్లాకు విచ్చేసినట్లు తెలిపారు. అదేవిధంగా శుక్రవారం సత్యసాయి జిల్లా కలెక్టరేట్లో అధికారులతో ఈ పథకాల అమలుపై సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాధన ధ్యేయంగా పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వాలు ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేశాయని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులను వాడుకోవడంలో కూడా విఫలమైందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం హయంలో రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి చేయలేదని దీంతో రాష్ట్రం బాగా వెనుకబడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇప్పుడిప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందు వెళ్తుందని తెలిపారు. లంకా దినకర్ తో పాటు జిల్లా బిజెపి అధ్యక్షులు కురుబ రాజేష్, మాజీ అధ్యక్షులు బిజెపి రాష్ట్ర నాయకులు సంధి రెడ్డి శ్రీనివాసులు ఉన్నారు.

# డీఈఓ ప్రసాద్ బాబుకు గుండెపోటు

## ఐసీయూలో కొనసాగుతున్న చికిత్స

**రిపబ్లిక్ క్రైమ్,ఏప్రిల్ 09,అనంతపురం**

అనంతపురం జిల్లా డీఈఓ కడప ప్రసాద్ బాబు గుండెపోటుకు గురయ్యారు. పది తరగతి పబ్లిక్ పరీక్షల విధుల్లో భాగంగా స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీలో ఉండగా అస్వస్థకు గురయ్యారు. వెంటనే ఆ శాఖ ఉద్యోగులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో గుండె నాళం బ్లాక్ అయినట్లు గుర్తించిన వైద్యులు.. ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. త్వరలోనే ఆయనకు స్టంట్ వేయనున్నట్లు వైద్య బృందం తెలిపింది.ప్రస్తుతం ప్రసాద్ బాబు ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్య బృందం వెల్లడించింది.



కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి దగ్గరుండి సపర్యలు చేస్తున్నారు.ఎప్పుడూ అందరితో కలివిడిగా ఉండే ప్రసాద్ బాబు తొందరగా కోలుకోవాలని అందరూ కోరుకుంటున్నారు.

## సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు డీఈఓ

గుండెపోటుకు గురైన అనంతపురం డీఈఓ కడప ప్రసాద్ బాబును ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు తరలించారు. గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన డీఈఓ ప్రసాద్ బాబును రామ్ నగర్ లోని శ్రీ స్వరా హాస్పిటల్ లో చేర్పిన సంగతి తెలిసిందే. కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో డీఈఓ ప్రసాద్ బాబును జే. ఎన్.టీ.యూ సమీపంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# ఘనంగా రెడ్ క్రాస్ తలసేమియా కేంద్రం ప్రారంభం

**అనంతపురం సంక్షేమం, ఏప్రిల్ 09,( రిపబ్లిక్ న్యూస్ ):**

నగరంలోని పాతవూరు సీడీ హాస్పిటల్ ఆవరణలో గురువారం రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్ ను జిల్లా రెవెన్యూ అధికారి మలోల చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమములో ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి రామారావు, రాష్ట్ర రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్ర రాజు, రెడ్ క్రాస్ అనంతపురం జిల్లా చైర్మన్ కాపు భారతి, జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్, రెడ్ క్రాస్ తలసేమియా కేంద్రానికి ఆర్థిక, వస్తు సహాయం చేసిన దాతలు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన తలసేమియా బాధిత చిన్నారులు, వారి తల్లితండ్రులు, రక్త దాన శిబిర నిర్వాహకులు, వివిధ కళాశాలల ప్రోగ్రామ్ ఆఫీసర్లు, విద్యార్థిని విద్యార్థులు, సమాజ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర శాఖ తరపున పూర్తి సహాయం చేస్తాం**

ఈ సందర్భంగా రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడి.రామారావు మాట్లాడుతూ, తలసేమియా పిల్లలకు సేవ చేయటం అన్ని సేవా కార్యక్రమాలు కన్నా అతిపెద్ద మానసిక ప్రశాంతత కలిగించే సేవా కార్యక్రమమని, రెడ్ క్రాస్ కాకినాడ



తలసేమియా కేంద్రంలో రక్త మార్పిడి చేసుకుంటున్న పిల్లలలో కొందరు ఉన్నత విద్యాభ్యాసంలో ఉన్నారని, సేవ చేయాలనుకునే వారు రెడ్ క్రాస్ సేవ కార్యక్రమములో పాల్గొనాలని, జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని రాష్ట్ర శాఖ తరపున పూర్తి సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ రామచంద్ర రాజు మాట్లాడుతూ రాష్ట్ర శాఖ తరపున త్వరలోనే ఇంపోర్టెడ్ లింబ్స్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తామని, తలసేమియా కేంద్రం చాలా బాధ్యతతో కూడుకున్న కార్యక్రమం అని జిల్లాలో ప్రముఖమైన పిల్లల డాక్టర్లు శ్రీనివాసులు, రఘువంశి వంటి వారు ఈ కేంద్రంలో సేవా చేయటానికి స్వచ్ఛందంగా ముందుకు రావటం శుభ పరిణామం అని కొనియాడారు.

**రెడ్ క్రాస్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి**

జిల్లా రెవెన్యూ అధికారి మలోల మాట్లాడుతూ రెడ్ క్రాస్ చేసే సేవా కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం సహాయ సహకారములు ఎల్లప్పుడూ ఉంటాయని, జన్యు సంబంధిత తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు రెడ్ క్రాస్ పూర్తి ఉచితంగా రక్త మార్పిడి, మందులు, ఇతర సహాయ కార్యక్రమములు అన్ని పూర్తి ఉచితంగా అందించటానికి ప్రణాళిక చేయటం చాలా సంతోషకరమని రెడ్ క్రాస్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తలసేమియా చిన్నారులు మాట్లాడుతూ తరచూ రక్త మార్పిడికి ప్రయాణాలు చేయాల్సి వస్తుందని చాలా సార్లు రక్త దాతలు ఏర్పాటు చేసుకోవటం ఇబ్బందిగా ఉంటుందని రెడ్ క్రాస్ లో అన్ని సదుపాయాలతో ఆహ్లాదకర వాతావరణంలో తలసేమియా కేంద్రం ఏర్పాటు చేయటం సంతోషకరం అని అన్నారు.

# హత్యకేసులో ఇద్దరు ముద్దాయిల అరెస్ట్

**కర్నూలు క్రైమ్ ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**

కర్నూల్ టౌన్ బిర్లా గడ్డ కు చెందిన బడేసాబ్, వినయ్, కిరణ్ కుమార్ మరియు గణేష్ నగర్ కి చెందిన రాజారెడ్డి లు స్నేహితులు. అందరి వయస్సు 20 సంవత్సరాల లోపు వారే.

7/8 వ తేదీ అర్ధ రాత్రి హతుడు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థి అయిన కిరణ్ కుమార్ అతని స్నేహితుడైన బడే సాబ్ కి ఫోన్ చేసి వారు తనతో పాటు కృష్ణానగర్ కి రావాలని అడుగగా బడే సాహెబ్ మరియు కిరణ్ కుమార్ ఇద్దరు కలిసి ఒక మోటార్ సైకిల్ లోను ఇతర స్నేహితులైన వినయ్ రాజారెడ్డి మరొక మోటార్సైకిల్ లోను కృష్ణా నగర వైపు రాగా అక్కడ కృష్ణానగర్ జంక్షన్ నందు చికెన్ కబాబ్ బండి నడుపుకునే అన్నదమ్ములైన ఇస్మాయిల్ మరియు అస్లాం ల ఇంటి వద్ద ఆగి గతంలో మద్దూరు నగర్ లోని ఒక పెళ్లిలో కలుసుకొని, నిర్దిష్టమైన కారణం లేకుండా అన్నదమ్ములైన ఇస్మాయిల్, అస్లాం కు మరియు కిరణ్ కుమార్ కి వాగ్వాదం జరిగి ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి వెళ్ళగా అక్కడున్న పెద్దవాళ్లు కలుగజేసుకొని సర్ది చెప్పి పంపించడంతో ఎవరిళ్లకు వారు వెళ్లిపోయారు.

అయితే అదే విషయాన్ని మనసులో



పెట్టుకొని హతుడు కిరణ్ కుమార్ మరియు వారి స్నేహితులు కలిసి కృష్ణ నగర్ లో నివాసం ఉండే అస్లాం ఇంటికి వెళ్లి మాట్లాడుకోవాలి కిందికి రా అని పిలవగా అస్లాం మరియు ఇస్మాయిల్ లు కిందికి రాగా కిరణ్ కుమార్ కి అస్లాం కి మధ్యలో గతంలో పెళ్లిలో జరిగిన వాగ్వాదం పైన ఒకరు దూషించుకుంటూ ఉండగా ఇంతలో బడేసాబ్, వినయ్, రాజారెడ్డి లు వారిని విడిపించే క్రమంలో అన్నదమ్ములైన ఇస్మాయిల్, అస్లాం లు కిరణ్ కుమార్ ని చాతి మీద కడుపు మీద కొట్టడంతో కింద పడ్డ కిరణ్ కుమార్ కి తలకు గాయం అవ్వడం వల్ల లేవలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు అది గమనించని నిందితులు అస్లాం, ఇస్మాయిల్ లు కాళ్లతో కిరణ్ కుమార్ యొక్క ఛాతి మీద తన్నడం జరిగింది.

దెబ్బలు తిన్న కిరణ్ కుమార్ వాంతులు చేసుకోవడంతో కిరణ్ కుమార్ యొక్క స్నేహితులు బడే సాబ్ వినయ్ రాజారెడ్డి లో నిందితులను పక్కకు తోసి కిరణ్ కుమార్ ని హాస్పిటల్ కి తీసుకెళ్లే క్రమంలో నిందితుల్లో ఒకరైన ఇస్మాయిల్ పక్కనే ఉన్న చిన్న రాయితో బడే సాబును కూడా కొట్టడంతో తలకు గాయం అయింది. వెంటనే కిరణ్ కుమార్ ని అతని స్నేహితులు కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కి చికిత్స కోసం తరలించగా పరీక్షించిన డాక్టర్లు అతను అప్పటికే చనిపోయినాడు అని నిర్ధారించడం జరిగింది.సదరు విషయాన్ని హతుడి స్నేహితుల ద్వారా తెలుసుకున్న అతడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు 4వ టౌన్ పోలీస్ స్టేషన్, కర్నూలు నందు కేసు నమోదు పరిచి, కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు, కర్నూల్ డీఎస్పీ బాబు ప్రసాద్ వారి సూచనల మేరకు సిఐ విక్రమ సింహ, ఎస్సైగోపినాథ్, ఎస్సై చంద్ర శేఖర్ రెడ్డి, ఏఎస్ఐ మునిరామయ్య, పి సి లు సుబ్బారాయుడు, మురళీధర్, ప్రత్యేక బృందంగా ఏర్పడి ధర్యాప్తు లో భాగంగా ఈ రోజున కేసులో నిందితులుగా ఉన్నటువంటి అన్నదమ్ములు ఇస్మాయిల్ మరియు అస్లాం లను కృష్ణానగర్ లో అరెస్టు చేసి రిమాండ్ కి తరలించడం జరిగింది.

# బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించాలి






**కర్నూలు ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఈ రోజు అనగా 09-04-2026 న స్థానిక జిల్లా కోర్టు లోని న్యాయ సేవ సదన్ లో బాలుల న్యాయ చట్టం గురుంచి అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. కబర్ధి మాట్లడుతూ అంతర్జాతీయ బాలల వడంబడిక ప్రకారం రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక నిబంధనలపై పోలీసు అధికారులు అవగాహన కలిగివుండాలని తెలిపారు. బాల నేరస్తుల్లో వుండే నేర స్వభావాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి కౌన్సిలింగ్, విద్యాబోధన ద్వారా వారిలో మార్పు తీసుకురావలసిన అవసరం ఎంతైనా వుందని తెలియజేశారు. బాల నేరస్తుల్లో నేర స్వభావాన్ని నియంత్రించి మంచి మార్గంలో నడిపించేందుకు అందరు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి పిలుపునిచ్చారు. జువినైల్ జస్టిస్ యాక్ట్ గురించి చైర్మన్ కమ్ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ టి. అపర్ణ తెలియజేసారు. ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్ పలు రంగాలకు సంబంధించి ఎలాంటి సేవలలో లోపంగానీ, నష్టంగానీ, అన్యాయంగానీ జరిగితే తక్షణమే పర్మనెంట్ లోక్ అదాలత్, కర్నూలు వారికీ వినతిపత్రంతో పాటు, తగిన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు. ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా అతి తక్కువ సమయంలో న్యాయం అందజేస్తామని తెలిపారు. మహిళా డి. ఎస్. పి. ఉపేంద్ర బాబు పిల్లలు కేసు ల పట్ల ఎలా విచారణ చెయ్యాలో పోలీసులకు తెలియజేశారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ చంద్ర శేఖర్ బాలుర మానసిక రుగ్మతలపై సూచనలు సలహాలు తెలియజేసారు. మానసిక సమస్యల పరిష్కారం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 14416 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కర్నూలు ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెంట్ హుసేన్ భాష మాట్లాడుతూ బాలుర సంక్షేమం గురుంచి వివరించి బాలల పట్ల పాటించాల్సిన నిబంధనలు కేసుల విచారణ అంశాల గురుంచి వివరించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం పిల్లల దత్తత చట్టం గురుంచి వివరించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్న వయస్సు లో గర్భం దరిస్తే వచ్చే దుష్ప్రభావాల గురించి వివరించే గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ, డి. సి. పి. ఓ. శారద, డిస్టిక్ ప్రొఫెషనరీ ఆఫీసర్ దివాకర్,జె. జె. బి. మెంబర్ మాదవి, ఒన్ స్టాప్ సిబ్బంది,చిల్డ్రన్స్ ఎన్జీవో మౌనిక, కర్నూలు జిల్లా ప్రత్యేక జువైనల్ పోలీస్ యూనిట్ సిబ్బంది, సంభందిత శాఖల సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాకు కట్టడి ఉండాల్సిందే

## మంత్రి నారా లోకేశ్ స్పష్టీకరణ



**అమరావతి, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** మారుతున్న కాలంలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. దాని దుష్ప్రభావాల నుంచి భావి తరాలను కాపాడుకోవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ బాధ్యత ప్రభుత్వంపైనా ఉందని నారా లోకేశ్ స్పష్టం చేశారు. పిల్లల డిజిటల్ భద్రత, మహిళల గౌరవంపై మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'పిల్లల మానసిక వికాసం దెబ్బతినకుండా ఉండేందుకు సోషల్ మీడియాలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్నారు. 13 నుంచి 16 ఏళ్ల వయసు పిల్లలకు కేవలం వారి ఎదుగుదలకు, విద్యకు ఉపయోగపడే కంటెంట్ మాత్రమే అందుబాటులో ఉండేలా విధివిధానాలను రూపొందించాలి. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని విద్వేషాలను చిమ్మేవారిని ఉపేక్షించేది లేదు. మహిళల పట్ల అవమానకరంగా ప్రవర్తించినా, అశ్లీల లేదా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాలు, అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న డిజిటల్ సేఫ్టీ చట్టాలను అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమ విధానాన్ని అమలు చేయాలి. పిల్లలను సోషల్ మీడియా దుష్ప్రభావాలకు దూరం చేయడం ఇప్పుడు అనివార్యం. వారి సృజనాత్మకతను కాపాడుతూనే, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని అన్నారు.

# భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

## జలధారజల హారతి కార్యక్రమం ద్వారా నీటి భద్రత బలోపేతం గ్రామ స్థాయి ప్రణాళికలపై కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.సమీక్ష.



**కర్నూలు, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.గురువారం కోసిగి మండలం డి. బెలగల్ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో "జలధారజల హారతి" కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి నీటి ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ గ్రామ ప్రజలు, సాగునీటి సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నీటి భద్రత ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ఎక్కువ నీటిని వినియోగించే వరి వంటి పంటల స్థానంలో తక్కువ నీటితో పండే పంటలను రైతులు ఎంచుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమం "జలధారజల హారతి" ద్వారా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా చెరువులు, చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు, పూడికతీత పనులు ఉపాధి హామీ పథకంతో వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని అన్నారు. గ్రామాలలో సంవత్సరాలుగా ఉపయోగంలో లేని చెక్‌డ్యామ్‌లు, చెరువులలో పెరిగిన పిచ్చి మొక్కలను బుష్ క్లియరెన్స్ ద్వారా శుభ్రపరిచి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో కోసిగి ప్రాంతంలో భూగర్భ జలాలు సుమారు 29 మీటర్ల లోతులో ఉన్నాయని పేర్కొంటూ, వాటిని పెంపొందించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని వృథా కాకుండా కుంటలు, వాగులు, చెరువులలో నిల్వ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం స్థానిక నాయకులు, సాగునీటి సంఘాల నాయకులతో మరియు సంబంధిత అధికారులతో కలిసి గ్రామానికి సంబంధించిన భూగర్భ జలాలను పెంపొందించే గ్రామ ప్రణాళిక మ్యాప్ మరియు సంబంధిత అంశాలను కలెక్టర్ చర్చించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, డ్వామా పి.డి నరసింహారెడ్డి, ఇరిగేషన్ ఎస్.ఈ బాలచంద్రరెడ్డి, ఎల్.ఎల్.సి చైర్మన్ టిప్పు సుల్తాన్, సాగునీటి సంఘం అధ్యక్షులు అనంతసేనారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నరస రెడ్డి, తహసీల్దార్ వేణు గోపాల్ శర్మ, ఎంపీడీవో యస్.యం భాషా తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ రిజిస్ట్రార్‌కు హైకోర్టు షాక్

## వాయిదాలకు గైర్హాజరు కావడంపై ధర్మాసనం ఆగ్రహం

**అమరావతి, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు షాకిచ్చింది. వాయిదాలకు గైర్హాజరు కావడంపై ధర్మాసనం ఆగ్రహించింది. ఈ మేరకు బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. గతంలో యూనివర్శిటీ విధుల నుంచి తమను తొలగించడంపై ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. అయితే కోర్టు ఆదేశాల అమలులో యూనివర్శిటీ రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు నిర్లక్ష్యం వహించారు. 52 రోజులపాటు వారిని విధుల్లోకి తీసుకోలేదు. దీనిపై మరోసారి కోర్టును సదరు కాంట్రాక్టు ఉద్యోగులు ఆశ్రయించారు . తమకు 52 రోజుల జీతం కూడా ఇప్పించాలని విన్నవించారు. వాయిదాలకు రాకపోవడం, కోర్టు ఉత్తర్వులు అమలు చేయడంలో జాప్యం చేసినందున రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడుపై బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది ధర్మాసనం. ఇప్పటికే యూనివర్శిటీలో పలు అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వులు సంచలనంగా మారాయి.

# తెలంగాణలో మండుతున్న ఎండలు

## ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే భానుడి భగభగలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 3 డిగ్రీలు పెరుగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. గురువారం ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఎండలు, వడగాలులతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనం బయటకు రావాలనే జంకుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండు ఆవర్తన ద్రోణుల ప్రభావంతో వచ్చే వారంపాటు పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నది. బుధవారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్జ్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో అత్యధికంగా 41.6 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5, నల్లగొండ జిల్లా నేరడుగొమ్మలో 41.5, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 41.4, జనగామ జిల్లా పాలకుర్తిలో 41.2, వరంగల్ జిల్లా సంగెంలో 41.2, హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# నల్లగొండలో నకిలీ నోట్ల వ్యాపారం

## మాటువేసి దుండుగుడి పట్టివేత

**నల్లగొండ,ఏప్రిల్ 9(ఆర్ఎన్ఎ):** కష్టపడకుండానే, ఏ పని చేయకుండానే సంపాదించాలనే ధోరణితో కొందరు కేటుగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారు. కొందరు పెట్టుబడుల పేరుతో, ఆన్ లైన్ బెట్టింగ్ పేరుతో మోసం చేస్తుంటే.. ఈ కేటుగాడు లక్ష అసలుకు 5 లక్షల దొంగనోట్లు ఇస్తానని చెప్పి సామాన్యులను మోసం చేస్తున్నాడు. నల్లగొండ జిల్లాలో నకిలీ నోట్లతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నకిలీ కరెన్సీ తో మోసం చేసిన నిందితుడిని తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. అమాయకులను టార్గెట్ చేసి నకిలీ 500 నోట్లతో మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని నేరాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. లక్ష రూపాయల అసలు కరెన్సీకి 5 లక్షల నోట్ల ఆఫర్ పేరుతో మోసం చేసినట్లు చెప్పారు. నల్ల కాగితాన్ని కెమికల్‌తో అసలు నోట్లలా చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. నోట్ల కట్టలలో పైభాగంలో ఒరిజినల్ నోట్లు లోపల నల్ల కాగితాల కట్టలతో చూపించి మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మల్లేపల్లి వారిగూడేనికి చెందిన వంగూరి జానయ్య మోసానికి గురవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. ట్రాప్ వేసి తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి బ్లాక్ కలర్ కాగిత కట్టలు, కెమికల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌మీ మొబైల్ ఫోన్, నాలుగు అసలు 500 నోట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సల్మాన్ ఉమా డాలియా అలియాస్ గోయిట సోంగలో అనే వెస్ట్ ఆఫ్రికా, మాలి దేశానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చిన నిందితుడు బెంగళూరులో నివసిస్తూ వ్యాపారం చేస్తున్నాడు. నకిలీ కరెన్సీ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు ఛేదించిన డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ వి. శంకర్, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

# మక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

## కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్న సీతక్క



**మహబూబాబాద్, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు గార్ల మండలం సీతంపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో కొనుగోలు కేంద్రాలపై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు మంత్రి సీతక్క రంగంలోకి దిగారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలో సీతక్క పర్యటించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. వారి కోరిక మేరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొక్కజొన్నలు ప్రైవేట్ దళారీలకు విక్రయించి మోసపోవద్దని ఈ సందర్భంగా రైతులకు మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.2,400 గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు. ఒక్క ఎకరాకు 25 క్వింటాలు మాత్రమే కొనుగోలు కాకుండా 50 క్వింటాలు పండించినా ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఇబ్బంది పడకుండా పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

# ఇంటర్ ఫలితాల ప్రకటనపై దు ష్ప్రచారాలు

## వదంతులు నమ్మవద్దన్న తెలంగాణ ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో తెగ వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం, అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాలు ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ కాలేదన్న విషయం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టింది.గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014 మే 3, 2015 - ఏప్రిల్ 22, 2016 - ఏప్రిల్ 22, 2017 - ఏప్రిల్ 16, 2018 - ఏప్రిల్ 13, 2019 -ఏప్రిల్ 18, 2020 - జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021-జూన్ 28 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2022 - జూన్ 28, 2023 - మే 9, 2024 - ఏప్రిల్ 24, 2025 -ఏప్రిల్ 22 ప్రకటించారు' అని పోస్ట్ చేశారు. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలను బట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ప్రతి ఏటా మారుతుంటాయి. అదే విధంగా, ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. మూల్యాంకన సమయాన్ని బట్టి, ఫలితాల విడుదల ప్రకటన చేస్తారు. ఇంటర్మీడియట్ ఫలితాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరుతున్నాము. సామాజిక మాధ్యమాలలో ప్రచారమయ్యే తప్పుడు వార్తలను నమ్మ వద్దని తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ పేర్కొంది.

--------------

# ఒక యుద్ధం..అనేక చేదు అనుభవాలు !

ట్రంప్, నెతన్యాహులు కలిసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా÷– నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు




కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహ్రైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు ర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే ర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# జనం నవ్వుకుంటున్నారు

## మావిగన్ పేరుతో మరో నాటకం -జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత

**ఏలూరు, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** మావిగన్' పేరు ఎత్తితే జనం నవ్వుకుంటున్నారని హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై అక్కసుతో ఇలా చేస్తున్నారని, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి విరుచుకుపడ్డారు. 'గత వైపీపీ హయాంలో కనీసం ఒక ఫైర్ ఇంజన్ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. తప్పు చేసిన వారి విషయంలో చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామన్నారు. అవగాహన లేని వాళ్ళు గతంలో ఇష్టానుసారంగా వ్యవహరించి కోర్టుల నుంచి మొట్టికాయలు వేయించుకున్నారని తెలిపారు. విజ్ఞత కలిగిన నాయకులు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అలాంటి




తప్పులు చేయదలుచుకోలేదని హోం మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏదైనా చట్ట ప్రకారం చేయడమే తప్ప ఎక్కడా ఉదాసీనతగా వ్యవహరించదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు. ఉదయం ఏలూరు చేరుకున్న హోం మంత్రికి ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణ, గన్ని వీరాంజనేయులు, రెడ్డి అప్పలనాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.2 కోట్ల 72 లక్షలతో నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని అనిత ప్రారంభించారు. ఆపై పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ప్రతాప్ కిషోర్ పాల్గొన్నారు.

# తాత్కాలిక కాల్పుల విరమణ జరిగినా..

## సైనిక బలగాలు ఇరాన్ చుట్టూ కొనసాగుతాయి

## స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు అక్కడే కొనసాగుతాయని తెలిపారు. ఇరాన్–అమెరికా మధ్య బుధవారం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు,



విమానాలు, సైనికులు, ఆయుధాలు మొదలైనవి ఇరాన్ పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయని ట్రంప్ పేర్కొన్నారు .యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తి స్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు సైనికులు వెనక్కి రారని ట్రంప్ తెలిపారు. ఒకవేళ ఒప్పందాన్ని ఇరాన్ పాటించకపోతే మునుపెన్నడూ చూడని స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఒప్పందం కుదిరేవరకు అమెరికా సైన్యం అక్కడే విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తుందన్నారు. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు భారీగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 254 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. 1,100 మందికి పైగా గాయపడ్డారని సమాచారం. ముఖ్యంగా బీరుట్, దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో నష్టం మరింత తీవ్రంగా ఉందని వార్తలు వస్తున్నాయి.

# పాకిస్థాన్‌పై మాకు నమ్మకం లేదు

## ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా–మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నెతన్యాహూకు స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత

## కాల్పుల విరమణ ..రాజకీయ వైఫల్యం

## ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ విమర్శలు

**టెలిఅవీవ్, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** యుద్ధ లక్ష్యాలను సాధించడంలో ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు విఫలమయ్యారని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని, ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆక్షేపించారు. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని రాజకీయ వైఫల్యంగా అభివర్ణించారు. యుద్ధ లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు తీవ్రంగా విఫలమయ్యారని, ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ భద్రతకు ప్రమాదకరమని యైర్ లాపిడ్ పేర్కొన్నారు. 'మన చరిత్రలో ఇంతటి రాజకీయ విపత్తు ఎన్నడూ జరగలేదు. అహంకారం, నిర్లక్ష్యం, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్ల నెతన్యాహు కలిగించిన రాజకీయ, వ్యూహాత్మక నష్టాన్ని పూడ్చడానికి మనకు సంవత్సరాలు పడుతుంది' అని ట్వీట్ చేశారు. సైన్యం తమకు అప్పగించిన పనులన్నీ పూర్తి చేసిందని, ప్రజలు కూడా అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించారని, అయితే నెతన్యాహు రాజకీయంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విమర్శించారు. తాను నిర్దేశిరచుకున్న లక్ష్యాలలో దేనినీ నెతన్యాహు సాధించలేకపోయారన్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించడం లేదా తీవ్రంగా దెబ్బతీయడాన్ని నెతన్యాహు యుద్ధానికి ప్రధాన లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని
ఇజ్రాయెల్‌కు అస్తిత్వ ముప్పుగా అభివర్ణించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలను నిర్వీర్యం చేయాలని, ఇరాన్ పాలనను బలహీనపరచాలని, దాని మిత్ర బృందాల నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకోవాలని నెతన్యాహు లక్ష్యాలుగా పెట్టుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు దారుణంగా విఫలమయ్యారని మాజీ ప్రధాని నాఫ్తాలి బెన్నెట్ విమర్శించారు. 'నాయకత్వం మనకు భ్రమలు కల్పించింది. వారి వాగ్దానాలన్నీ ఈ రాత్రి మన మొహం మీదే పేలిపోయాయి' అని బెన్నెట్ ట్వీట్ చేశారు. ఈ ఒప్పందం రాబోయే సంవత్సరాల పాటు ఇజ్రాయెల్ భద్రతను ప్రమాదంలో పడేసే ఒక సంపూర్ణ వైఫల్యం అని అభివర్ణించారు.

## ఇంటర్ ఫలితాలను ఉద్దేశపూర్వకంగా

# ఆలస్యం చేస్తున్నారా?

## : తెలంగాణ విద్యాశాఖ ఏం చెప్పిందంటే?




**ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** ఇంటర్ ఫలితాలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యా శాఖ ఖండించింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. ఫలితాల ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని తెలిపింది.ఇంతకుముందు ఎప్పుడూ ఏప్రిల్ మొదటి వారంలో ఇంటర్ ఫలితాలు విడుదల కాలేదని ఈ సందర్భంగా గుర్తు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గత ఏడాది వరకు జరిగిన ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదలైన తేదీలను కూడా పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఫ్యాక్ట్ చెక్ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది.ఇంటర్ ఫలితాలు 2014లో మే 3న, 2015లో ఏప్రిల్ 22న, 2016లో ఏప్రిల్ 22న, 2017న ఏప్రిల్ 16న, 2018లో ఏప్రిల్ 13న, 2019లో ఏప్రిల్ 18న, 2021లో జూన్ 28న, 2022లో జూన్ 28న, 2023లో మే 4న, 2024లో ఏప్రిల్ 24న, 2025లో ఏప్రిల్ 22న విడుదలయ్యాయని పేర్కొంది.సమాధాన పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాల ఆధారంగా ఫలితాలను ప్రకటించే తేదీలు ప్రతి సంవత్సరం మారుతుంటాయనే విషయాన్ని గ్రహించాలని పేర్కొంది. మూల్యాంకనం పూర్తయ్యే సమయం ఆధారంగానే ఫలితాలను విడుదల చేస్తారని తెలిపింది. విద్యా శాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విద్యార్థులు, తల్లిదండ్రులు విశ్వసించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యే తప్పుడు వార్తలను నమ్మవద్దని కోరింది.

# మీడియాపై ఏ పార్టీ దాడి చేసినా నేను ఖండిస్తా

## : వెంకయ్యనాయుడు



**ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):** మీడియా స్వేచ్ఛ, మాతృభాష ప్రాముఖ్యతపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. చిత్తూరులోని ఎస్వీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన, నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.
ఇటీవల మీడియా సంస్థలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఆయన స్పందిస్తూ... వార్తల్లో అసత్యాలు ఉంటే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉంటుందని, కానీ భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదని హితవు పలికారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యలను ఏ రాజకీయ పార్టీ చేసినా తాను తీవ్రంగా ఖండిస్తానని స్పష్టం చేశారు. మాతృభాషను మర్చిపోవడం అంటే అమ్మను మర్చిపోవడమేనని, జన్మనిచ్చిన తల్లిని, ఊరిని, దేశాన్ని ఎప్పుడూ గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియా ఊబిలో పడి సమయాన్ని వృథా చేయవద్దని, చదువుతో పాటు ఆటలకు, యోగాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాజకీయ వారసత్వానికి తాను వ్యతిరేకినని, అయితే సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాలను ప్రోత్సహిస్తానని వెల్లడించారు. ఆహారపు అలవాట్లను మార్చుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్

## ఉత్తమ నటులుగా నాగచైతన్య, రష్మిక

భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్ 2026 విజేతలను ప్రకటించారు. ప్రతి ఏడాది దేశంలోని పలు భాషల చిత్ర పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు, ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువసామ్రాట్ నాగచైతన్య 'తండేల్' సినిమాలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే ఈ ఇద్దరూ తెలంగాణ గద్దర్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందగా, ఇప్పుడు ఎఔిఅంలో కూడా అదే కేటగిరీలో విజేతలుగా నిలవడం విశేషం. ఇక తెలుగు విభాగంలో ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి గాను ఎంపికయ్యారు. అదే సినిమాలో నటించిన మాస్టర్ రేవంత్ (బుల్లిరాజు)కు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డు లభించింది. హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకే బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలోనూ అవార్డు రావడం విశేషం. ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రామ్ జగదీష్ ('కోర్ట్') ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు సొంతం చేసుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కన్నడలో రిషబ్ శెట్టి 'కాంతార: చాప్టర్ 1' చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకోగా, అదే సినిమా ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పౌలీ ఉత్తమ నటుడిగా నిలిచారు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. ఈ వేడుకకు టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి మరియు బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్టులుగా వ్యవహరించనున్నారు. సీనియర్ నటి రేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.






# 'డెకాయిట్'తో కొంచెం రొమాన్స్ .. మరి కొంచెం యాక్షన్ : మృణాల్!

వెండితెరపై బంగారు తీగలా కనిపించే హీరోయిన్స్ ను చూస్తూ ప్రేక్షకులు కదలడం మరిచిపోతుంటారు .. ఒక్కోసారి కథను కూడా మరిచిపోతుంటారు. హీరోయిన్స్ గ్లామరస్ గా కనిపించాలనే ఆడియన్స్ కోరుకుంటారు. ఇక పాత్రను బట్టి వాళ్ల నటన కనెక్ట్ కావడం .. కాకపోవడం జరుగుతూ ఉంటుంది. అయితే హీరోయిన్స్ మాత్రం గ్లామరస్ గా కనిపించడం కంటే, కాస్త బరువైన .. లోతైన పాత్రలను చేయడానికే ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు. అలాంటి ఒక డిఫరెంట్ రోల్ తనకి 'డెకాయిట్'లో లభించినందుకు మృణాల్ ఠాకూర్ చాలా మురిసిపోతోంది. అడివి శేష్ జోడీగా ఆమె చేసిన ఈ సినిమా, రేపు విడుదలవుతోంది. ఈ సినిమాలో తన పాత్ర చాలా లోతైనదిగా కనిపిస్తుందని ఆమె ఇంటర్వ్యూలలో చెబుతూ వచ్చారు. ఒక పాపకు తల్లిగా తాను కనిపిస్తాననీ, బరువైన ఆ పాత్ర సహజత్వానికి చాలా దగ్గరగా ఉండటం వలన, వెంటనే ఆ పాత్రలో లీనమైపోయేదానినని అన్నారు. ఇక ఈ సినిమాలో రొమాన్స్ తో పాటు యాక్షన్ దృశ్యాలలోను తాను నటించానని చెప్పారు. ఈ రెండింటిలో రొమాన్స్ సీన్స్ లో చేయడమే తనకి కష్టంగా తోచిందని అన్నారు. మృణాల్ ఠాకూర్ లో మంచి నటి ఉందనే విషయాన్ని 'సీతారామం' నిరూపించింది. ఆ సినిమా ఆమెకి సక్సెస్ తో పాటు, మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ తరువాత ఆమె చేసిన సినిమాలేవీ మళ్లీ ఆ స్థాయిలో మాట్లాడుకునేలా చేయలేకపోయాయి. 'ది ఫ్యామిలీ స్టార్' ఆమె అభిమానులను బాగా నిరాశపరిచింది. ఆ తరువాత ఆమె నుంచి వస్తున్న ఈ సినిమా, భారీ హిట్ అందుకోవడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది.

# రేణు దేశాయ్‌పై అసభ్యకర కామెంట్..

## గుంటూరు వ్యక్తి అరెస్ట్



నటి రేణు దేశాయ్ సోషల్ మీడియా రీల్‌పై అసభ్యకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్య పోస్ట్ చేసినందుకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఓ వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న వేధింపులపై రేణు దేశాయ్ ఇటీవల చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.

చెన్నయ్య రుంజాల అనే వ్యక్తి తన యూట్యూబ్ ఖాతా నుంచి రేణు దేశాయ్ రీల్‌ను చూసి, దానిపై అనుచిత వ్యాఖ్య చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారు. నిందితుడు గుంటూరులో ఉన్నట్లు తెలుసుకుని, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో నిందితుడు తన ఫోన్ నుంచే ఆ కామెంట్ పెట్టినట్లు అంగీకరించాడు.

ఆన్‌లైన్‌లో తనపై అసభ్యకరంగా మాట్లాడుతున్న వారిపై, తన వ్యక్తిగత జీవితంలోకి చొరబడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రేణు దేశాయ్ ఈ నెల ప్రారంభంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో విడాకులైనప్పటి నుంచి తాను వేధింపులు ఎదుర్కొంటున్నానని ఆమె గతంలో తెలిపారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అసభ్యకరమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దని అధికారులు హెచ్చరించారు. అభ్యంతరకరమైన కంటెంట్ పోస్ట్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సైబర్ నేరాల గురించి 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

## రమ్యకృష్ణ కూడా కీ రోల్




అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.


--------

# హారర్ కామెడీతో కొరియన్ కనకరాజు

వరుణ్ తేజ్ కథానాయకుడిగా రానున్న చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీ కథకి ఇండియా - కొరియా నేపథ్యాన్ని జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. తమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇస్తూ టీమ్ ఫన్నీ వీడియోను విడుదల చేశారు. ఏప్రిల్ 11న ఈ పాటను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సాంగ్స్ 'ఓజీ' స్థాయిలో ఉండాలని తమన్‌తో వరుణ్‌తేజ్ సరదాగా చెప్పారు.




# పెద్దిలో పాట కోసం నాయికాన్వేషణ



రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాలోని ప్రత్యేకగీతాన్ని త్వరలోనే తెరకెక్కించ నున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆ గీతంలో రామ్‌చరణ్‌తో కలిసి ఆడిపాడే కథానాయికని ఎంపిక చేయడంపై చిత్రబృందం దృష్టిపెట్టింది. ఇప్పటికే పలువురు కథానాయికల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా... తెలుగమ్మాయి మానస వారణాసి కూడా ఈ రేసులోకి వచ్చింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఆకట్టుకున్నారు మానస వారణాసి. చిత్రబృందం పరిశీలనలో ఆమె పేరు ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' తెరకెక్కుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. తుదిదశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా విడుదల తేదీపైన త్వరలోనే స్పష్టత రానుంది.

# హజ్ యాత్ర-2026 కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**విజయవాడలో హజ్ హౌస్ నిర్మాణానికి చర్యలు**

**హజ్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన మంత్రి**

**ఏపీ నుంచి హజ్ కు 2000 మంది ప్రయాణికులు**

**అమరావతి, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి హజ్ – 2026 కి మొత్తం 2000 మంది యాత్రికులు బయలుదేరనున్నారని, అందులో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి ఏప్రిల్ 18 మరియు 19 తేదీలలో 352 మంది ప్రయాణికులు బయలుదేరనున్నారని, వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికార యంత్రంగాన్ని రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు. గురువారం గన్నవరం ఎస్ఎం కన్వెన్షన్ హాల్ లో హజ్ క్యాంప్ –2026 కు ఏర్పాట్లపై మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టిడిపి ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగర నడిబొడ్డున అన్ని సౌకర్యాలతో హజ్ భవన్ నిర్మించడం జరిగిందన్నారు. అప్పట్లో హైదరాబాదులో కూడా ఎంబార్కేషన్ కేంద్రం ఉండేది కాదని, అప్పటి ప్రధాని వాజ్ పేయి దృష్టికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువెళ్లడంతో ఏంబార్కేషన్ కేంద్రం మంజూరు అయిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ ప్రయాణికులకు ఏంబార్కేషన్ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాలలోని కేంద్రాలకు వెళ్లాల్సి వస్తున్నదన్నారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా కేంద్రం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి విజయవాడకు ఏంబార్కేషన్ కేంద్రం మంజూరు చేయించారని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గారికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి, కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు గారికి , పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గారికి మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు. పవిత్ర మక్కాయాత్ర హజ్ కు వెళ్లే యాత్రికులందరికీ, అన్ని రకాల మౌలిక సదుపాయాలతో విజయవాడలో హజ్ హౌస్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. విజయవాడ నుంచి హజ్ కి వెళ్లే ప్రయాణికులు అందరికీ రూ. లక్ష ఆర్థిక సాయం కూటమి ప్రభుత్వం అందిస్తున్నదని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముస్లిం మైనారిటీల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం**
రాష్ట్రం నలుమూలల నుండి విజయవాడకు చేరుకునే ప్రయాణికులందరికి ఏర్పాటు చేసే క్యాంప్ లో హజ్ యాత్ర విజయవంతం కోసం అనుసరించాల్సిన నియమ నిబంధనలు, పద్ధతులు, వ్యవహరించాల్సిన తీరును విశదీకరించాలని సూచించారు. విజయవాడ నుండి




మదీనాకు ప్రత్యేక విమానాల ఏర్పాటు, యాత్రికుల బోర్డింగ్ వివరాలను హజ్ కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. యాత్రికుల లగేజీని వేగంగా తరలించేలా చూడాల్సిన ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. విమానాశ్రయంలోహజ్ యాత్రికుల కోసం ప్రత్యేక కౌంటర్లు, విడిగా అరైవల్/ డిపార్చర్ లాంజ్-లను, నమాజు వసతిని కేటాయించాలని, చెక్-ఇన్ ప్రక్రియ కోసం అదనపు సిబ్బందిని నియమించాలని, ప్రయాణికుల రాకపోకల విషయంలో హజ్ కమిటీతో సమన్వయం చేసుకోవాలన్నారు. హజ్ వీసాలను త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రూపుల కోసం ముందస్తు క్లియరెన్స్ సౌకర్యం కల్పించాలని పాస్ పోర్ట్ వెరిఫికేషన్ కోసం 24/7 సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. యాత్రికుల కోసం భద్రతా ప్రోటోకాల్ ను పెంచాలని, మహిళా యాత్రికుల కోసం ప్రత్యేక మహిళా సిబ్బందితో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. క్యాంప్ లు,లాంజ్-ల వద్ద సిసిటివి నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితి ని సంబంధిత అధికార యంత్రాంగం తెలుసుకుంటూ అందుకు అనుగుణంగా చర్యలు అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. కరెన్సీ మార్పిడి, హజ్ చెల్లింపుల కోసం క్యాంప్ తో పాటు విమానాశ్రయం వద్ద తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. యాత్రికులకు ఎటువంటి అదనపు రుసుము లేకుండా మార్పిడి సౌకర్యం, డిజిటల్ బ్యాంకింగ్ మద్దతు అందించాలని ఆదేశించారు.

**ప్రత్యేకంగా బస్సులు నడపాలి**
హజ్ యాత్రకు వెళ్ళేందుకు విజయవాడకు చేరుకునే యాత్రికులు అందరూ క్యాంప్ నుండి విమానాశ్రయం కు ఇబ్బందులు లేకుండా చేరుకునేలా ప్రత్యేక ఏసీ బస్సులను నడపాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. క్యాంప్, విమానాశ్రయం వద్ద తగినంత మంది వైద్యులు, నర్సులను అందుబాటులో ఉంచి, ప్రయాణానికి ముందు తప్పనిసరి ఆరోగ్య పరీక్షలు, ఉచిత వ్యాక్సినేషన్లు అందించాలన్నారు. అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచాలన్నారు.

**భద్రత ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలి**
హజ్ యాత్ర క్యాంప్ వద్ద తగినంత భద్రతా సిబ్బందితో ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని పోలీస్ శాఖకు మంత్రి ఫరూక్ సూచించారు. నేషనల్ హైవే–16 పై ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని, యాత్రికులకు రక్షణ కల్పించడంతో పాటు, మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్లపై నిఘా ఉంచాలన్నారు. క్యాంప్ వద్ద అంతరాయం లేని విద్యుత్ సరఫరా, బ్యాకప్ జనరేటర్లను సిద్ధం చేయాలన్నారు. లాంజ్–లలో 24/7 లైటింగ్ మరియు ఏసీ సౌకర్యం ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రతిరోజు సరిపడా ఆర్.ఓ తాగునీటిని సరఫరా చేయాలని,క్యాంప్ వద్ద తగినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేసి, రోజువారీ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని క్యాంప్, వద్ద, విమానాశ్రయం వద్ద ఫైర్ ఇంజన్ల వాహనాలను అందుబాటులో ఉంచాలాన్నారు. మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, అత్యవసర పరిస్థితుల్లో ఖాళీ చేసే విధానాలపై వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. యాత్రికుల మార్గాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో హజ్ అప్డేట్స్ కోసం రోజువారీ మీడియా బులెటిన్లను విడుదల చేయాలని,సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, తదితర సమాచార మార్గాల ద్వారా చేసి, ఎప్పటికప్పుడు సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో హజ్ యాత్ర విజయవంతం కోసం భాగస్వాములై యాత్రికులు అందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. ఈ సమీక్షలో హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ , హజ్ కమిటీ సభ్యులు, హజ్ కమిటీ సీఈఓ గౌస్ పీర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# వైసీపీ హయాంలో జరిగిన రీ సర్వే తప్పిదాలపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

**-మామిడి తోటపై కన్నేసిన కబ్జాదారులు.. భూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు**

**-గుంటూరులో దౌర్జన్యం.. ఇల్లు కట్టుకోనివ్వకుండా ఒంటరి మహిళకు వేధింపులు -అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు**

**-న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్, ఏపీ మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి**

**మంగళగిరి, ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
కర్నూలు జిల్లా హోళగుంద మండలం మద్దిలింగదహళ్ళి గ్రామానికి చెందిన వీరనాగప్ప గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 49–సా1లో మొత్తం 3.50 ఎకరాల భూమి ఉంది. అయితే గత ప్రభుత్వంలో జరిగిన రీ–సర్వే సమయంలో అధికారులు చేసిన పొరపాటు వల్ల రికార్డుల్లో కేవలం 3.31 ఎకరాలు మాత్రమే నమోదయ్యింది. అంటే దాదాపు 19 సెంట్ల భూమి రికార్డుల నుండి తొలగించారు. ఈ తప్పును సరిదిద్ది, పాత విస్తీర్ణం ప్రకారం 19 సెంట్లను తిరిగి కలపాలని కోరుతూ జిల్లా గ్రీవెన్స్, ఆర్.డీ.ఓ, తహసీల్దార్, గ్రామ సచివాలయ సర్వేయర్ గారికి అనేకసార్లు విన్నవించుకున్నాను. అయినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు, పొలం సరిహద్దుల్లో ఉన్న వ్యక్తుల నుండి తనకు వేధింపులు ఎదురవుతున్నాయి. దీనిపై రక్షణ కోరుతూ పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ చేయలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్, ఏపీ మాదిగ వెల్ఫేర్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. విజయనగరం జిల్లా రాజాం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 95/1 లో తమకు మొత్తం 57 సెంట్ల మామిడి తోట ఉండేది. ఇందులో 11 సెంట్లు భూమిని 1984లోనే వేరే వ్యక్తికి విక్రయించాము. మిగిలిన 46 సెంట్ల భూమి తమ హక్కు భుక్తంలో ఉంటూ వస్తోంది. అయితే ఈ భూమిని ఆక్రమించే ఉద్దేశంతో



కొందరు వ్యక్తులు చుట్టూ ప్రహరీ గోడను నిర్మించారు. గోడ కడుతున్న సమయంలో తాము వెళ్లి అడ్డుకున్నా, వారించమని కోరినా వినకుండా.. దౌర్జన్యంగా నిర్మాణం పూర్తి చేశారు. తమకున్న కొద్దిపాటి జీవనాధారమైన ఈ భూమిని తమకు దక్కకుండా చేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. గుంటూరుకు చెందిన షేక్ హలీమాబీ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. 4-05-1996వ తేదీన షేక్ అమనాబి గారి వద్ద 133.5 గజాల ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశాను. 2004లో తన భర్త చనిపోయినప్పటి నుండి తన ఐదుగురు కుమారులతో కలిసి అక్కడే నివసిస్తున్నాను. గతంలో తన భర్త వేసిన రేకుల ఇల్లు పాడైపోవడంతో, ఇప్పుడు కొత్తగా ఇల్లు నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తుండగా షేక్ నసీర్ అహ్మద్ అనే వ్యక్తి అడ్డుపడుతున్నారు. ఈ స్థలం తనదని, రోడ్డులో భాగం కూడా తనకే చెందుతుందని చెబుతూ తనపై తన పిల్లలపై దౌర్జన్యానికి దిగుతున్నారు. ఏ అధికారికి చెప్పుకున్నా నన్ను ఏమీ చేయలేరంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. పైగా, వారే తమపై దాడి చేస్తూ కాలనీ పెద్దల ముందు తాము వారిపై దాడి చేసినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. తన వద్ద ఈ స్థలానికి సంబంధించి వక్ఫ్ బోర్డ్ ఇచ్చిన ప్లాట్ అలాట్‌మెంట్ కాపీ, కొనుగోలు అగ్రిమెంట్, మున్సిపల్ పన్ను రసీదులు, కరెంటు మీటర్ బిల్లులు, పొజిషన్ సర్టిఫికేట్ అన్నీ ఉన్నాయి. చివరికి 2011లో గృహ నిర్మాణ శాఖ వారు ఇల్లు కట్టుకోవడానికి ఇచ్చిన అనుమతి పత్రాలు కూడా తన వద్ద ఉన్నాయి. అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ ఒంటరి మహిళను కావడంతో మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. గుంటూరు జిల్లా మేడికొండూరుకు చెందిన నల్లూరి సామ్రాజ్యం గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తాము సాయిరాం మహిళా గ్రూపు సభ్యులుగా డ్వాక్రా స్త్రీ నిధి రుణాన్ని తీసుకున్నాము. తీసుకున్న అప్పును వడ్డీతో సహా పూర్తిగా జమ చేశాము. అయితే, అధికారులు అదనపు వడ్డీ చెల్లించాలని వేధించడంతో.. దీనిపై వివరణ కోరగా సంబంధిత అధికారులు సీసీ, ఏజీఎం, మేనేజర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ తప్పుడు సమాచారంతో కూడిన స్టేట్‌మెంట్లు ఇచ్చారు. ఈ అవకతవకలపై గత నాలుగు నెలలుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అనేకమార్లు అర్జీలు సమర్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎటువంటి విచారణ జరగలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగడం లేదు సరికదా, మమ్మల్ని మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని స్త్రీ నిధి రుణాల చెల్లింపుల్లో జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# కాస్కేడ్ విధానంతో ట్యాంకుల నింపుదలపై కలెక్టర్ ఫోకస్

**డోన్ నియోజకవర్గంలో నీటి సామర్థ్య పెంపుకు కార్యాచరణ**

**చిట్టచివరి ఆయకట్టు వరకు నీరు అందించడమే లక్ష్యం**

**జలధార ప్రోగ్రామ్‌తో నీటి వనరుల బలోపేతం -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 09 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో కాస్కేడ్ విధానం ద్వారా ట్యాంకులను సమర్థవంతంగా నింపేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో 'జలధార' కార్యక్రమంపై భూగర్భ జలశాఖ, జలవనరుల శాఖ, డ్వామా మరియు ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్



సెంటర్ నోడల్ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి 'జలధార' కార్యక్రమానికి సాంకేతిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. జిల్లాలో గుర్తించిన 23 కాస్కేడ్ వ్యవస్థల ద్వారా 86 ట్యాంకులను నింపేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా డోన్ నియోజకవర్గంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి, చిట్టచివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలో జిల్లాకు సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ సరిహద్దులు, వాగులు, ట్యాంకులు, భూభాగ వినియోగ వివరాలతో కూడిన జియోస్పేషియల్, మ్యాప్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. అలాగే జిల్లాలోని 23 కాస్కేడ్ ట్యాంకులను టోపోషీట్ల ఆధారంగా ఒకే మ్యాప్‌లో సమగ్రంగా పేర్కొన్నారు. జిల్లాలోని 11 మండలాల్లో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లోని త్రాగునీటి సమస్యల పరిష్కారం, బనగానపల్లి పశ్చిమ ప్రాంతంలో కొత్త కాస్కేడ్ ప్రతిపాదన, కొలిమిగుండ్ల, సంబంధిత ప్రాంతాల్లోని నీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా భూగర్భ జలశాఖ అధికారి రఘురాం, జలవనరుల శాఖ అధికారి శివశంకర్, డ్వామా పీడీ సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పత్రికా స్వేచ్ఛపై వైసిపి దాడి అమానుషం.

**ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడిని ఖండించిన**

**నంద్యాల జనసేన పార్టీ నాయకులు మారాసు గురుబాబు.**

**నంద్యాల ఏప్రిల్ 9 (రిపబ్లిక్ న్యూస్):**
హైదరాబాద్ లో ఏబీఎన్ – ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడి యత్నాన్నినంద్యాల జనసేన పార్టీ నాయకులు మారాసు గురుబాబు తీవ్రంగా ఖండించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నేతలు, రౌడీలు దాడికి దిగడం మీడియా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు,మీడియా సంస్థలను నడుపుతూ మీడియాను అడ్డుపెట్టుకుని అనైతిక చర్యలకు పాల్పడుతోన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తమను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతిపై కక్షతో ఆరోపణలు, దూషణలు చేయడం పత్రికా స్వేచ్ఛను




హరించడమే అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మీడియా సంస్థలపై, ఆంధ్రజ్యోతిపై అనేక ఆంక్షలు విధించి, వేధింపులకు, కుట్రలకు పాల్పడినా నిబ్బరంగా నిలిచాయి తప్ప.. ఏనాడూ భయపడలేదని గుర్తు చేశారు. రౌడీ మూకలను వెంటేసుకుని స్వయంగా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు మీడియా కార్యాలయంపైకి వెళ్లడం వైసీపీ రౌడీ విష సంస్కృతికి నిదర్శం అని వ్యాఖ్యానించారు,ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ దశాబ్దాలుగా కేసులకు, దాడులకు,ఒత్తిళ్లకు భయపడకుండా పత్రికను, ఛానెల్ను నడుపుతున్నారన్నారని గుర్తు చేశారు. దాడులు, నిరసనలు, బెదిరింపులతో మీడియాను భయపెట్టాలనే వైసీపీ రాజకీయాలకు కాలం చెల్లిందని స్పష్టం చేశారు రాజధానిపై వైసీపీ కుట్రలను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతి సంపాదకీయానికి సమాధానం చెప్పలేక దాడులు, నిరసనలతో వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్కు పాల్పడుతోందని మారాసు గురుబాబు తెలిపారు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న మీడియా పై ఈ తరహా చర్యలను ప్రజలు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు.

# సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి: కలెక్టర్

**విధులకు గైర్హాజరు అయితే కఠిన చర్యలు**

**ఆన్‌లైన్ హాజరు లోపాలపై షోకాజ్ నోటీసులు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల, బ్యూరో, ఏప్రిల్ 09 (రిపబ్లిక్ న్యూస్):**
సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు సేవలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. గురువారం బేతంచెర్ల మండలం ఆర్. కొత్తపల్లె గ్రామంలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించారు. విధులకు హాజరుకాని పంచాయతీ గ్రేడ్–5 సిబ్బంది మరియు వీఆర్వోపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిబ్బంది



ఎవరెవరు ఏ విధులు నిర్వహిస్తున్నారనే అంశంపై కలెక్టర్ వివరణ కోరారు. సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను సమగ్రంగా పరిశీలించి, వాటి నిర్వహణపై సూచనలు ఇచ్చారు. సచివాలయ ఆవరణలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పబ్లిక్ పర్సెప్షన్ సర్వేలో సాధించిన పురోగతి, ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు, వాటిపై లబ్ధిదారులకు అవగాహన



కల్పిస్తున్నారా లేదా అనే అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీసర్వేకు సంబంధించి వీఆర్వో, సర్వేయర్ అందుబాటులో లేరని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన సచివాలయ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ప్రజా ఫిర్యాదుల విభాగం పనితీరును కూడా కలెక్టర్ సమీక్షించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com